క్లుప్తంగా

28న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సారవకోట: మదనాపురం ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 28న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎం.వి.రమణ సోమవారం తెలిపారు. దీనికి సంబంధించిన ఎమ్మార్సీలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని 3 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.3333, ద్వితీయ బహుమతి రూ.2,222, తృతీయ బహుమతి రూ.1,111, కన్సోలేషన్ బహుమతి రూ.516తో పాటు షీల్డ్ అందజేస్తామన్నారు. ఈనెల 27వ తేదీ లోగా 9160228267, 9642178419, 8179887121 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ మదనాపురంలో గల కాశీవిశ్వేశ్వర పంచాయతన దేవాలయం (శివకేశవ క్షేత్రం) 7వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజాకార్యక్రమాలను గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో జరిపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, మదనాపురం, జగన్నాథపురం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన అష్టోత్తర శత దివాస పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హిరమండలం: పెద్దకోరాడలోని లక్ష్మీగణపతి ఆలయంలో అష్టోత్తర శత దివాస పూజలు సోమవారంతో ముగిశాయి. గతేడాది నవంబర్ 1 నుంచి ప్రతిరోజూ అభిషేక పూజలు నిర్వహిస్తూ వచ్చారు. లోక కల్యాణార్థం 108 రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు సంతోష్‌శర్మ తెలిపారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. హిరమండలంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు.

హార్మోనిస్టు బాబూరావు మృతికి సంతాపం



బాబూరావు (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొరమాంబాపురం గ్రామానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు చెన్నబోయిన బాబూరావు (65) గుండెపోటుతో మృతి చెందారు. రాము బుర్రకథ దళంతో రణస్థలం మండలంలో ప్రదర్శన ఇచ్చేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. బుర్రకథ జరుగుతున్న సమయంలో హార్మోనియం ప్రదర్శన ఇస్తూ ఒక్కసారిగా స్టేజివద్ద కుప్పకూలిపోయారు. సహచరులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. బాబూరావుకు భార్య అమ్మన్న ఉన్నారు. ఈయన మృతికి స్థానిక నాయకులు, పలువురు కళాకారులు సంతాపం తెలియజేశారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఆమదాలవలస: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 6వ తరగతి, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులపై పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని, ఈ విషయం స్కూల్ యాజమాన్యానికి రెండురోజుల క్రితం తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో సోమవారం స్కూల్ వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాను అలా ప్రవర్తించలేదని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ జి.రాజేంద్రప్రసాద్ స్కూల్‌కు వచ్చారు. ఎంఈఓ అక్కడకు రాకముందే ఉపాధ్యాయుడిని ప్రిన్సిపాల్ విధుల నుంచి తొలగించారు. ఎంఈఓ విచారణ చేపట్టారు. తల్లిదండ్రుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించారు. ప్రిన్సిపాల్ నుంచి కూడా జరిగిన సంఘటనపై రాతపూర్వకంగా వివరణ తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

నిత్యన్నదాన పథకానికి రూ. 50 వేల వితరణ

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకానికి నరసన్నపేటకు చెందిన పొట్నూరు కృష్ణారావు, మాధురి దంపతులు 50,116 రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో గురునాథానికి సోమవారం అందజేశారు.

నకిలీకి చెక్

- రూ.1.50 కోట్ల వ్యయంతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు
- ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్ష



ల్యాబ్‌లో విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



పట్టణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



ఆమదాలవలస రూరల్: గతంలో వ్యవసాయం చేయాలంటే రైతులు ఆందోళన చెందేవారు. విత్తనం నుంచి ఎరువుల వరకు నకిలీలు బెడదతో తీవ్ర ఇబ్బందిపడాల్సి వచేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత రైతుల కష్టాలు గట్టెక్కినట్లు అయింది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు రైతులకు నిత్యం సేవలు అందించడానికి దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ ఉపయోగంలోకి రావడంతో రైతులకు నకిలీల బెడద తగ్గింది. ఆమదాలవలస పట్టణంలో మార్కెట్ యార్డు ఆవరణలో సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు తమ విత్తనాలను, ఎరువులను నేరుగా ఈ కేంద్రానికి తీసుకువస్తే వాటి నాణ్యతను పరిశీలించి రైతులకు తగిన వివరాలు తెలియజేయడం జరుగుతుంది. విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించడానికి నూతన టెక్నాలజీతో యంత్రాలను ఏర్పాటు చేశారు. రైతులు తమ విత్తనాలను నాణ్యత పరీక్షించాలంటే రూ. 1000 వరకు, ఎరువులు పరీక్షించాలంటే రూ. 2500 వరకు ఖర్చు అవుతుంది. రైతులకు పైసా ఖర్చు లేకుండా ఈ సేవలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నూతన వ్యవసాయ సాగు కోసం ఇలాంటి ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంతో నియోజకవర్గ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సకాలంలో సేవలు అందించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో గొప్పదని అంటున్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి



నరసన్నపేట: ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



సారవకోట: మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

సారవకోట: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడుచోట్ల నిర్వహించిన సిద్ధం సభలతో టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు దుష్ప్రచారాం చేస్తున్నారన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, డీసీడీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు శంకరబాబు, దండాశి, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, పల్లి కృష్ణారావు, గొర్లె ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదాస్‌ను గెలిపించండి..

నరసన్నపేట: ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను మరో సారి గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చేసుకుందామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. పాతపట్నం పర్యటనలో భాగంగా జిల్లాకు సోమవారం వచ్చిన ముత్యాలనాయుడు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కొద్ది సమయం స్థానిక, నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. నూతనంగా సిద్ధం చేసిన పార్టీ ప్రచార రథాన్ని ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సురంగి నర్సింగరావు, తంగుడు జోగారావు, కేసీహెచ్‌బీ గుప్త, పి.సాయిప్రసాద్, వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు, అల్లు అసిరినాయుడు, పాగోటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యతతో ఆర్థికాభివృద్ధి సాధ్యం



కుట్టు మిషన్ల శిక్షణను ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస రూరల్: మహిళలు వృత్తి నైపుణ్యతలో రాణిస్తే ఆర్థికాభివృద్ధి సాధించుకోవచ్చునని సత్యసాయి సేవా సంస్థల జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు అన్నారు. అక్కులపేటలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభించారు. మహిళలకు ఉచిత కుట్టు మిషన్ ద్వారా టైలరింగ్ శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తయిన మహిళలకు ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తామన్నారు. ఇంటి వద్ద ఉన్న మహిళలు టైలరింగ్‌లో శిక్షణ తీసుకోవడం వల్ల ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. ఈ శిక్షణకు ఎటువంటి రుసుం అవసరం లేదని, ఆసక్తి గల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, టైలరింగ్ మాస్టర్ కె.వాగ్దేవి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి ప్రతిమ, జాయింట్ యూత్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, పవన్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

స్వలాభానికే ప్రాధాన్యం

జలుమూరు: చిన్నదూగాం పంచాయతీ పరిధి తిలారు జంక్షన్‌లో గల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ 62వ ఉత్సవాల నిర్వహణను స్థానిక సర్పంచ్ భర్త శ్రీనివాసరావు తన స్వలాభానికి వాడుకుంటున్నారని గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు భార్గవి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా సర్పంచ్ భర్త, పోలీస్‌లు సహకరించడం లేదన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశించినా స్థానిక పోలీస్‌లు అనుమతి ఇవ్వకపోవడంపై డీజీపీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనిపై జలుమూరు ఎస్ఐ మధుసూదనరావు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలనే పాటిస్తున్నామని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆదేశాలు ఇచ్చే అధికారం తనకు లేదని తెలిపారు.

ఆలయ ప్రారంభోత్సవం

ఎల్.ఎన్.పేట: బొర్రంపేట వద్ద బొర్ర శంకరగిరిపై నిర్మించిన ఈశ్వర పంచాయతన ఆలయ ప్రారంభోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం హోమాలు నిర్వహించిన ట్లు గ్రామ పురోహితులు సుబ్రహ్మణ్య శర్మ తెలిపా రు. బొర్రంపేట పరిసర గ్రామాలకు చెందిన భక్తులతో సామూహిక కుంకుమ పూజలు, రుద్రాభిషేకాలను నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామ వలంటీర్లకు సత్కారం



గ్రామ వలంటీర్లను సత్కరిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ నాయకులు

సరుబుజ్జిలి: గ్రామ వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి వారిని సత్కరించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాలు నేరుగా ప్రజల చెంతకు అందజేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లు మరింత బాధ్యతాగా పనిచేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కోవిలాపు చంద్రశేఖర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయం మేరకే పనిచేయాలి



మాట్లాడుతున్న కరిమి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు

- సీఎం జగన్ ఎవరి టికెట్ ఇస్తే వారి విజయానికి కృషి చేయాలి
- నాలుగు మండలాల ప్రధాన నాయకులు

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో నరసన్నపేట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ టికెట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎవరికి ఇస్తే వారిని గెలిపించుకుందామని, పార్టీ నిర్ణయాన్ని గౌరవించి కలిసి పనిచేద్దామని ప్రధాన నాయకులు పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నాలుగు మండలాలకు చెందిన నాయకులు విలేకరులతో మాట్లాడారు. సర్వేల్లో, సీఎం జగన్ దృష్టిలో ఎవరు సరైన అభ్యర్థిగా ఉంటారో వారికే టికెట్ వస్తుందని, దీనికి అందరం కట్టుబడి పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌పై వ్యక్తిగత విమర్శలను పక్కన పెట్టి పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి మాట్లాడుతూ పార్టీలో ఉన్నవారు వ్యక్తిగత అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చని, చివరికి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరారు. వ్యక్తిగత స్వార్థంతో ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం తగదన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట పంచాయతీ సీనియర్ వార్డు సభ్యుడు కేసీహెచ్‌బీ గుప్తా మాట్లాడుతూ స్వార్థప్రయోజనాలు ఆశించి ఎమ్మెల్యేపై కొంతమంది వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఎన్నికల నేపథ్యంలో ఇటువంటివి మంచిది కాదన్నారు. నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో బలమైన కేడర్ కలిగిన వ్యక్తి ఎమ్మెల్యే కృష్ణదాస్ అని, ఆయన కాకుండా.. మరొకరు ఎవరైనా ఉంటే సూచించాలని కోరారు. కణిత సత్తిబాబు, నక్క తులసీదాస్, జి.వెంకటరమణ, కనుసు సీతారాం, బగ్గ రమణయ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో భీమలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సర్పంచ్ పెదకోట సాదుబాబు, త్రివేణి దంపతులు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గోగుల మాధవి, వరప్రసాదరావునాయుడు సోమవారం భూమి పూజ చేపట్టారు. ఈ ఆలయానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. కాలనీ చెందిన పలువురు వంశధార నిర్వాసితులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కళ్లుండి.. అభివృద్ధిని చూడలేకపోతున్నారు

- ప్రజలవద్దకే పరిపాలన తీసుకువచ్చాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



బెలమర జంక్షన్ వద్ద డీపీఎన్ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగున్న అభివృద్ధిని టీడీపీ నాయకులు కళ్లుండి.. కూడా చూడలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకి మండలంలోని పలు సచివాలయాల పరిధిలో సుమారు రూ.25 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. జాతరలా జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్కడిక్కడ పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణదాస్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గ్రామాల్లోకే నేరుగా పరిపాలన తీసుకువచ్చామన్నారు. రోడ్లు, భవనాలు, ఇంటింటికి తాగునీరు వంటి మౌలికవసతుల తోపాటు నవరత్నాలు వంటి సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శవంతంగా అందజేస్తున్న ప్రభుత్వం మనదే అని చెప్పటానికి గర్వపడుతున్నానని అన్నారు. మారుమూల మత్స్యకార గ్రామాల్లోకి వెళితే అనేకసార్లు మౌలిక వసతుల కోసం ప్రశ్నించిన అక్కడి జనం.. ఇప్పుడు ఆ ఊసేఎత్తటం లేదని, ఇది మార్పు కాదా...? అని ప్రశ్నించారు. మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని కోరారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం ఇలా..

తలసముద్రంలో హెల్త్‌సెంటర్, గ్రామ సచివాలయ భవనం, కొల్లివలసలో ఇంటింటికీ కుళాయిలు, ముప్పిడి నుంచి బొడ్డవానిపేట రహదారి, ఈదులవలసలో ఇంటింటికీ కుళాయిలు, రాళ్లపాడులో నాడు–నేడు పాఠశాల పనులు, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనం, సంతక్ష్మీపురంలో ఇంటింటికీ కుళాయిలు, పంచాయతీ భవనం, పల్లిపేటలో గ్రామ సచివాలయ భవనం, అంపలాంలో ఇంటింటికీ కుళాయిలు, కొత్తరేవులో గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల సముదాయం, పిన్నింటిపేటలో విలేజ్ హెల్త్ క్లినిక్, సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, రేగుపాడులో సీసీ రహదారి, రహిమానుపురంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ భవనాలు, బెలమర జంక్షన్‌లో డీపీఎస్ రహదారి, బెలమరలో ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాలు, పాలవలసలో ఇంటింటికీ కుళాయిలు, ప్రియాగ్రహంలో ఆర్‌బీకే, సీసీ రహదారి, సుసరాంలో ఇంటింటికీ కుళాయిలు, దువ్వవలసలో సీసీ రహదారి, చెల్లాయివలసలో ఆర్‌బీకే, గంగివలసలో సీసీ రహదారిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు పాగోటి అప్పారావునాయుడు, డోల ఉదయభాస్కర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



తలసముద్రంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



రాళ్లపాడుతో నాడు-నేడు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



కలశాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

సారవకోట: మండల కేంద్రంలోని శివ రామ పాత్రుని కోనేరు గట్టుపై నిర్మించిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామి వారి విగ్రహ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేశారు. మహిళలు కలశాలతో గ్రామంలో తిరువీధి నిర్వహించారు.

నేడు వలంటీర్లకు సన్మానం

పాతపట్నం: స్థానిక మార్కెట్ యార్డు ఏదురుగా ఉన్న బీసీ కమ్యూటీ భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.వెంకన్నబాబు సోమవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 421 మంది గ్రామ వలంటీర్‌లకు సేవా పుస్కారాలను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అందజేస్తారన్నారు.

మెళియాపుట్టి: గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం సత్కరిస్తారని ఎంపీడీఓ కొండలరావు అన్నారు.

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లను సత్కరించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రంలోని లక్ష్మీనర్సుపేట రోడ్డులో ఉన్న ఓ కల్యాణ మండలంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొంటారన్నారు.